సాక్షి ప్రకాశం

మంగళవారం । 5 । మార్చి । 2024



సొంతింటి కల జగనన్నతో సాకారం

పేదల సొంతింటి కల జగనన్నతో సాకారం అవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. దర్శిలో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. - 8లో..



మోడల్ టౌన్‌గా మార్కాపురం

మార్కాపురం పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ ఆంగ్ల పరీక్షకు 93.45 శాతం మంది హాజరు

ఒంగోలు: జూనియర్ ఇంటర్ ఆంగ్ల పరీక్షకు సోమవారం 93.45 శాతం మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 2129 మందికిగాను 19,902 మంది, ఒకేషనల్ విభాగంలో 2702 మందికిగాను 22,177 మంది హాజరయ్యారు. మొత్తంగా 23,731 మందికిగాను 22,177 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1127 మంది, ఒకేషనల్ విభాగంలో 427 వెరసి 1554 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ఆర్‌ఐవో నాలుగు సెంటర్లను తనిఖీ చేయగా డీఈసీ సభ్యులు, జిల్లా పరిశీలకులు 6 సెంటర్లను, స్క్వాడ్ బృందాలు 43 సెంటర్లను తనిఖీ చేశారని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని ఆర్‌ఐవో వెల్లడించారు.

6న హాకీ మహిళా క్రీడాకారిణిల ఎంపిక

చీమకుర్తి: ప్రకాశం జిల్లా తరపున రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కలిగిన మహిళా క్రీడాకారిణిలను ఎంపిక చేస్తున్నట్లు హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, సుందరరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారిణిల ఎంపిక ఈనెల 6న సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఎంపికైన క్రీడాకారిణులతో జిల్లా జట్టు ఈనెల 8, 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత

- రూ.5.10 లక్షల విలువైన లాప్‌టాప్‌లు, శ్రవణ యంత్రాల పంపిణీ

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు లాప్‌టాప్‌లు, శ్రవణ యంత్రాలు సోమవారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జేసీ రోనంకి గోపాలకృష్ణ అందజేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ జీ అర్చన ఆధ్వర్యంలో స్పందన సమావేశపు మందిరంలో లబ్ధిదారులకు అందజేశారు. 12 మంది దివ్యాంగులకు రూ.4.20 లక్షల విలువైన లాప్‌టాప్‌లు, 18 మందికి లబ్ధిదారులకు రూ.90 వేలు విలువైన శ్రవణ యంత్రాలు అందజేశారు. ఆయా ఉపకరణాలను వినియోగించుకుని జీవితంలో మరింత వృద్ధి చెందాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కోరారు.

ఉన్నత ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలి

- ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏకేయూ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి.హరిబాబు

ఒంగోలు: విద్య, ఉద్యోగ, వ్యాపార, సేవా రంగాల్లో నేటి యువత ఉన్నత ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. స్థానిక యూనివర్సిటీ సెమినార్ హాలులో సోమవారం ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థులు సైతం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుతంగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్య ద్వారా విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉన్నత స్థానానికి చేరుకుంటే తల్లిదండ్రులు, బోధించిన గురువులకు, అభ్యసించిన విద్యా సంస్థకు మంచి పేరు వస్తుందన్నారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల కోసం ప్రతి విద్యార్థి అత్యుత్తమ ప్రతిభా పాటవాలను తప్పకుండా పెంపొందించుకోవాలన్నారు. ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.పద్మజ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పేదింట ఆనందమే లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టా ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం
- 21 వేలమందికి రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు
- మరో 4 వేల మందికి కూడా భూములు సిద్ధం
- రానున్న ఎన్నికలు నాకు చివరివి.. ఆశీర్వదించండి
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు
- ధ్రువీకరణ పత్రాలతో పాటు లబ్ధిదారులైన దంపతులకు దుస్తుల పంపిణీ
- మొదటి రోజు ఐదు డివిజన్లలో 1,793 మంది లబ్ధిదారులకు అందజేత



ఇంటి పట్టా చేతికందిన ఆనందంలో మహిళలు



9వ డివిజన్‌లో నిర్వహించిన ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్:

''పేద కుటుంబాలన్నీ ఆనందంగా...కుటుంబం మొత్తం నవ్వుతూ ఉండాలన్నదే మా ఆకాంక్ష.. ఇళ్ల పట్టాలతో పాటు మహిళలకు చీరలు పెడదామని అనుకున్నా. నా సతీమణి శచీదేవి అందుకు నిరాకరించింది. పట్టాతో పాటు మహిళలకు చీరలు పెడితే సరిపోదు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల అనేది ఓ గొప్ప కోరిక. ఆ కోరిక మీరు నెరవేరుస్తున్నారు. మహిళలకు మాత్రమే చీరలు పెట్టడం కాదు. దంపతులకు కలిపి ఇరువురికీ దుస్తులు పెడదాం అన్నది. ఆమె సలహా మేరకు దంపతులకు దుస్తులు పెట్టాలని అప్పుడు నిర్ణయించుకున్నాను. అందుకే దంపతులకు దుస్తులు పెడుతున్నాము కాబట్టి మేము కూడా దంపతులం వచ్చి మరీ పట్టాతో పాటు దుస్తులు సంతోషంగా ఇస్తున్నాం'' అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలో పూరి గుడిసె లేకుండా చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన స్పష్టం చేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాల భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నగరంలోని ఐదు డివిజన్లలో చేపట్టారు. ముందు బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు లాంఛనంగా పంపిణీ చేస్తుంటే వారి వెంటనే యువనేత, బాలినేని తనయుడు ప్రణీత్ రెడ్డి, శ్రీ కావ్య దంపతులు మిగతా అందరికీ పంపిణీ చేస్తూ వచ్చారు. మొత్తం మీద ఐదు డివిజన్లలో కలిపి 1,793 మంది లబ్ధిదారులకు తొలిరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని సొంత ఇళ్లులేని నిరుపేదలకు అందరికీ సొంతింటి కల నెరవేర్చటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. సొంతిల్లు లేని ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇళ్ల పట్టా ఇచ్చి సొంత ఇల్లు నిర్మించి ఇద్దామన్నదే తన ప్రధాన ఆలోచనగా పెట్టుకున్నానన్నారు. నిరుపేదలకు ఇళ్ల పట్టా ఇస్తేనే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను అని గతంలో ప్రకటించానని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలు తనకు చివరి ఎన్నికలని, అందు కోసం నియోజకవర్గ ప్రజలు వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. తనను ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయటమే భాగ్యంగా భావిస్తున్నానని బాలినేని సంతోషంగా అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తున్నానని వెల్లడించారు. మొత్తం ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, అయితే మొదటగా 21 వేల మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ భూ హక్కు పత్రాలు అందిస్తున్నామని, భరోసా పత్రాలు ఇచ్చిన వారిలో కొంత మందికి సాంకేతిక లోపాలు వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగలేదన్నారు. వాటిని నివారించి వాళ్ల కోసం కూడా మరో 4 వేల మందికి భూములు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచామన్నారు. ఏ ఒక్కరూ అధైర్యపడవద్దన్నారు. భూ హక్కు పత్రాలతో పాటు లబ్ధిదారులైన అర్హులందరికీ దంపతులకు కూడా దుస్తులు పెడుతున్నామన్నారు. చెప్పిన మాట ప్రకారం అందరికీ ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. అందు కోసం రూ.233 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల చేయించుకొని మరీ రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి ఇస్తున్నామన్నారు. ముందుగా నగరానికి ఈశాన్యంలో 9వ డివిజన్ ఉంది కాబట్టి ఇక్కడి నుంచే పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సొంతంగా ఇల్లు కట్టుకోవాలనుకుంటే కట్టుకోవచ్చన్నారు. ప్రభుత్వం రూ.1.75 లక్షలు నిధులు అందిస్తుందని, ఇసుక ఉచితంగా ఇవ్వటంతో పాటు సిమెంట్, స్టీలు రాయితీతో అందిస్తుందన్నారు. అలాకాకపోతే ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందన్నారు. అదేవిధంగా డ్వాక్రా మహిళలకు రూ.35 వేలు పావలా వడ్డీకే బ్యాంకుల నుంచి మంజూరు చేయిస్తామని వెల్లడించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వాళ్లకు కూడా ఇళ్ల పట్టాలు ఇస్తున్నారన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చూడాలి, ఎన్నికలై పోయిన తరువాత ప్రభుత్వానికి అందరూ సమానమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పారని, ఆ విధంగా ముందుకు పోదామని చెప్పి వాసన్న అర్హులందరికీ ఇస్తున్నారన్నారు. ఒంగోలు నగరంలో కొత్తగా రెండు టౌన్ షిప్‌లు నిర్మిద్దామన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో పాటు పార్కులు, దేవాలయాలు కూడా నిర్మించేలా వాసన్న ప్రణాళికలు రూపొందించారన్నారు. కార్యక్రమంలో బాలినేని శచీదేవితో పాటు మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్ర రావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.జశ్వంత రావు, రాష్ట్ర ఆర్య వైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవ రావు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బీసీ విభాగం అధ్యక్షుడు గోలి తిరుపతి రావు, యువజన విభాగం అధ్యక్షుడు గంటా రామానాయుడు, పార్టీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వెన్నపూస శోభారాణి వెంకట రెడ్డి, గండు ధనలక్ష్మి, ఎందేటి పద్మావతి రంగారావు, ధనలక్ష్మీ, గంగవరపు ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ఇంటి పట్టాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు



ఇంటి స్థలం పట్టా అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు

పేదల పక్షపాతి బాలినేని వాసన్న



పేదల పక్షపాతి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి. సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూశాం. ఎన్ని అడ్డంకులను ఎదుర్కొని, తన రాజకీయ జీవితాన్నే ఫణంగా పెట్టి మరీ మా కోసం పోరాడారు. చివరకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే ఎన్నికల్లో పోటీ చేయను అనే వరకు వాసన్న వెళ్లారంటే ఆయన పేదల కోసం చేస్తున్న పోరాటం మరిచిపోలేనిది. ఏళ్ల తరబడి బాడుగ ఇళ్లలో ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడుతూ వస్తూ జీవితమనే బండిని లాగుతున్నాం. రెక్కాడితే కానీ డొక్కాడని మా లాంటి కుటుంబాలకు వాసన్న ఒక దిక్సూచిలో నిలిచారు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం. వచ్చే ఎన్నికల్లో ఆయననే బలపరుస్తాం. ఆయన కుటుంబం చల్లగా ఉండాలి.

– దోని సుజాత, 9వ డివిజన్ లబ్ధిదారు

సొంతింటి కల నెరవేర్చారు



నా చిరకాల కోరిక సొంతిల్లు కట్టుకోవాలని. ఎంత కష్టపడినా కుటుంబాన్ని పోషించుకోవటంతోనే సరిపోతూ వచ్చింది. ఇన్నాళ్లికి ఆ కోరికను మా నేత బాలినేని శ్రీనివాస రెడ్డి నెరవేర్చారు. ప్రతి పక్ష పార్టీ నాయకులు, టీడీపీ వాళ్లు కోర్టులకు వెళ్లి పేదల ఇళ్ల పట్టాలు ఆపాలని ఎన్ని కుయుక్తులు చేసినా చివరకు బాలినేని మంచితనమే విజయం సాధించింది. బాలినేని పేదలకు న్యాయం చేయాలనుకుంటే టీడీపీ నాయకులు కళ్లతో చూడలేకున్నారు. అయినా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతుల వద్ద ప్రైవేటు భూములు కొనుగోలు చేసిమరీ ఇళ్ల పట్టాలు సాధించారు.

– పోలిశెట్టి శివ, 9వ డివిజన్ లబ్ధిదారు

సీఎం పర్యటనకు పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు



సొరంగ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, నియోజకవర్గ ఇన్‌చార్జి



వెలిగొండ ప్రాజెక్టు వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న దినేష్ కుమార్, తాటిపర్తి

- కలెక్టర్ దినేష్‌కుమార్
- ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- అధికారులతో కలిసి హెలిప్యాడ్,పైలాన్లను పరిశీలించిన ఇన్‌చార్జి తాటిపర్తి

పెద్దదోర్నాల: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు ఈనెల 6న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహనరెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు కలెక్టర్ ఏఎస్. దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, యర్రగొండపాలెం సమన్వయకర్త తాటిపత్రి చంద్రశేఖర్‌తో కలిసి మండల పరిధిలో కొత్తూరు వద్దనున్న ప్రాజెక్టు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను వారు పరిశీలించారు. తొలుత హెలిప్యాడ్ ప్రాంతాన్ని, పైలాన్ ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం రెండో సొరంగ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం జగన్ ఈ నెల 6న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు సొరంగ నిర్మాణ ప్రాంతానికి రానున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రొటోకాల్ ప్రకారం బందోబస్తు:

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. హెలిప్యాడ్, టన్నెల్ ప్రదేశంలో బ్యారికేడ్ల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రోడ్లు, భవనాలశాఖ అధికారులకు సూచించారు. బందోబస్తు ఏర్పాట్లలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా పక్కాగా చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.

స్పెషలిస్ట్ డాక్టర్లను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ జాలిరెడ్డి, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూతాలిం, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజ్యలక్ష్మి, సీపీఓ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్‌బీ ఎస్ఈ. దేవానందం, సీపీడీసీఎల్ సత్యానారాయణ, డీసీహెచ్ఎస్ మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సుపరిపాలన



కాకర్లలో సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించిన సీఎం జగన్
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- రూ.1.9 కోట్లతో నిర్మించిన శాశ్వత భవనాలు ప్రారంభం

మర్రిపూడి: డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామస్థాయిలో సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని చిలంకూరు, కాకర్ల గ్రామాల్లో సోమవారం పలు సీసీ రోడ్లు, సచివాలయం, ఆర్బీకే, జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రిని వైఎస్సార్ సీపీ శ్రేణులు గజమాలతో సత్కరించి, మేళతాళాలతో ర్యాలీ నిర్వహిస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని చిలంకూరు గ్రామంలో రూ.5 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీరోడ్డు, ఎస్సీ కాలనీలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్, రూ.17.67 లక్షలతో నిర్మించిన జగనన్న పాలవెల్లువ కేంద్రం, అలాగే కాకర్లలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23.90 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలను మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఎస్సీ కాలనీలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చి విద్యకు జగనన్న పెద్దపీట వేశారన్నారు. నాడు-నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ విద్య సంస్థలకు దీటుగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీచేసి మహిళల ఆత్మగౌరవాన్ని జగనన్న నిలబెట్టినట్లు చెప్పారు. కాపునేస్తం, ఈబీసీ నేస్తం లాంటి పథకాలు తీసుకొచ్చి అన్ని వర్గాల మహిళలను ఆదుకున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అండగా నిలబడ్డారన్నారు. మేనిఫెస్టోలో 25 లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి, 32 లక్షల ఇళ్ల స్థలాలు మహిళల పేరుతో పట్టాలు అందించారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఒకటో తేదీ ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో ఏరాష్ట్రంలో లేని విధంగా అసైన్డ్ భూములకు శాశ్వత హక్కు కల్పించారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతామని హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేందుకు యువకులు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం చిలంకూరు గ్రామంలో ప్రమాదానికి గురైన కోటా నర్సింహారావును మంత్రి పరామర్శించారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లెర్ల నర్సింహారెడ్డి, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, చిమట, మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు బీవీ భాస్కర్ రెడ్డి, మాకినేని వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు దొద్దాలి మల్లికార్జున, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, బీవీ భాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మొల్లల శివరామిరెడ్డి, నారాయణరెడ్డి, పీ సంజీవరెడ్డి, ఎం ప్రభాకర్‌రెడ్డి, మునపాటి నర్సింహారావు, చెన్నపనాయుడు, రమణయ్య, రమేష్, చంద్రమౌళి, కే సుబ్బారెడ్డి, మేశం బ్రహ్మయ్య, మేశం శివన్నారాయణ, వీరెళ్ల బ్రహ్మయ్య, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సాయం చేసిన ఘనత సీఎం జగన్‌దే

- పేద ప్రజల గుండె చప్పుడు 'ఫ్యాన్'గుర్తు
- చీమకుర్తిలో ఇంటి పట్టాల పంపిణీ, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున



చీమకుర్తిలో ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. చీమకుర్తిలోని 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని పేదలకు సోమవారం రాత్రి ఇంటి పట్టాల పంపిణీ, కార్యకర్తల పరిచయ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజలు ఏ పార్టీకి ఓటేశారో కూడా చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల గుర్తు 'ఫ్యాన్' పేద ప్రజల గుండె చప్పుడన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని మంత్రి మేరుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు. కరోనా కాలంలో చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్ కల్యాణ్ ఎక్కడో హైదరాబాద్‌లో దాక్కున్నారని, కరోనాకు కూడా భయపడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రజలకు అండగా నిలిచి ధైర్యాన్ని కల్పించారన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఇప్పటి వరకు 100కు పైగా బటన్ నొక్కి పథకాలు అందించారని, రానున్న ఎన్నికల్లో ఎంపీకి, ఎమ్మెల్యేకి ప్రతి ఓటరు రెండు సార్లు బటన్ నొక్కి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్‌లు బాపతు వెంకటరెడ్డి, నలమల మాణిక్యం, స్థానిక కౌన్సిలర్లు బడే అయ్యపరెడ్డి, పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి సుందర రామిరెడ్డి, సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, ఎంపీటీసీ చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, జీ.ఓబుల్‌రెడ్డి, గోపురపు చంద్ర, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సొంతింటి కల జగనన్నతో సాకారం

- వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మతో కలిసి దర్శిలో రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పేదల సొంత ఇంటి కలను సాకారం చేసిన జగనన్న రుణం తీర్చుకోలేనిదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో తహసీల్దార్ సుజాత అధ్యక్షతన సోమవారం దర్శి మండలంలోని పేదలకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ మాట్లాడుతూ.. దర్శి నియోజవర్గంలో 6,425 మంది పేదలకు పట్టాలివ్వగా దర్శి మండలంలో 3,262 మందికి లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ఒక్కో ఇంటికి రూ.2.70 లక్షల చొప్పున రూ.173 కోట్లకు పైచిలుకు నిర్మాణానికి కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అని స్పష్టం చేశారు. కేవలం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జగనన్న పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం ఎవరిదో.. మాట ఇచ్చిన తప్పిన ప్రభుత్వం ఎవరిదో అక్క చెల్లెమ్మలు గమనించాలని సూచించారు. చంద్రబాబు బంగారు బిస్కెట్లు కూడా ఇస్తానని చెబుతాడు కానీ గుడ్ డే బిస్కెట్ కూడా పేదలకు ఇవ్వని వ్యక్తి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు.

దర్శి మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో ఇంటింటికీ తాగునీటి పథకం టెండర్లు పూర్తయ్యాయన్నారు. కాపు నేస్తం ద్వారా కాపులకు ఎన్నడూ లేని మేలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేశారన్నారు. పేదలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో నియోజకవర్గంలో లబ్ధిదారులకు రూ.350 కోట్లు డబ్బు అందిస్తే చంద్రబాబు మాత్రం ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని విమర్శించడం సిగ్గుచేటన్నారు. పట్టాలు ఇంకా అందనివారికి తప్పనిసరిగా స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా, ఎంపీపీ సుధారాణి, నగర పంచాయతీ కమిషనర్ మహేష్, ఎంపీడీఓ హనుమంతరావు, డీటీ రవిశంకర్, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, డైరెక్టర్లు కుమ్మిత అంజిరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, విమల రామకృష్ణ, ఎంపీటీసీలు సుబ్బులు, రాచపూడి రత్నం, బండి గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు కేసరి రాంభూపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు జగన్నాథం మోహన్‌బాబు, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, జేసీఎస్ కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు, పాణెం కృష్ణారెడ్డి, కోరే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

మోడల్ టౌన్‌గా మార్కాపురం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- రూ.50 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 9వ వార్డులోని గుండ్లకమ్మ కెనాల్‌పై 30 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణానికి, 19వ వార్డులో 10 లక్షల రూపాయలతో నూతనంగా డ్రైనేజీ పనులకు, 22వ వార్డులో 10 లక్షల రూపాయలతో డ్రైనేజీ, మెటల్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మార్కాపురం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని అన్నా విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లందరూ తమ వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకునిరావాలని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఎప్పుడైనా తనను కలవొచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు మొఘల్ సిరాజ్ బేగ్, డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, కోఆప్షన్ సభ్యురాలు వనజాక్షి, చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్త హరిహరరావు, మాజీ వైస్ చైర్మన్ కుర్షిద్ అహ్మద్, అమీరుల్లాఖాన్, రోజ్‌లిడియా, పట్టణ యూత్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- మార్కాపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ వారి సాధికారతే లక్ష్యంగా సీఎం జగనన్న ప్రభుత్వం ముందుకు సాగుతోందని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గిద్దలూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం నిర్వహించారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల పొదుపు గ్రూపు మహిళా సభ్యులకు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్యే కేపీ పాల్గొని మాట్లాడారు. పొదుపు గ్రూపుల అప్పుల భారాన్ని వైఎస్సార్ ఆసరా ద్వారా జగనన్న ప్రభుత్వం భరాయిస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ప్రభుత్వ పథకం నగదును నేరుగా లబ్ధిదారుడి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తోందన్నారు. ఈ విధంగా గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. మన జగనన్న ప్రభుత్వంలో ఎవరికీ లంచం ఇవ్వనక్కర్లేదని, ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేర్చాలనే ఉద్దేశంతో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు జగనన్న ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా మూడు మండలాల్లో 2,221 గ్రూపులకు 14 కోట్ల 78 లక్షల 60 వేల రూపాయలను బ్యాంక్ అకౌంట్లలో జమచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కడప లక్ష్మి, కమిషనర్ వి.శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పులి రామకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఓబులరావు, వైస్ చైర్మన్‌లు ఆర్.డి.రామకృష్ణ, కాతా దీపిక, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ ఆర్య వైశ్య సంఘ నాయకుడు, మాజీ సర్పంచ్ శివాపురం సురేంద్రకుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు, బాదం గోపాల్, బేస్తవారిపేట జెడ్పీటీసీ వెంకటరాజు, కొమరోలు జెడ్పీటీసీ వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల రంగస్వామి, కావేటి ఈశ్వర్‌నాయుడు, ఏపీఎంలు నరేష్, రమేష్, ప్రసాద్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్
- రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కనిగిరి రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 12 మంది లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నట్లు చెప్పారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులంతా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్లు పులిశాంతి, మాణిక్యరావు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఒకేరెడ్డి, ఎస్ మోహన్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, చింతం శ్రీను, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, జి.అబ్రహం లింకన్, శ్రీహరిరెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీరాం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, శ్రవణ యంత్రాలను సోమవారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జేసీ రోణంకి గోపాలకృష్ణ అందజేశారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ జి.అర్చన ఆధ్వర్యంలో స్పందన సమావేశ మందిరంలో లబ్ధిదారులకు అందజేశారు. 12 మంది దివ్యాంగులకు రూ.4.20 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు, 18 మంది లబ్ధిదారులకు రూ.90 వేల విలువైన శ్రవణ యంత్రాలు అందజేశారు. ఆయా ఉపకరణాలను వినియోగించుకుని జీవితంలో మరింత వృద్ధి చెందాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు.



ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఆడుదాం ఆంధ్రా విజేతలకు కలెక్టర్ అభినందన

- విజేతలకు కప్, మెడల్స్ అందచేత

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన జిల్లాకు చెందిన క్రీడాకారులను సోమవారం స్పందన హాలులో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చేలా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖోఖో మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందిన జిల్లా క్రీడాకారిణి హైమావతి ఖోఖో రాష్ట్ర స్థాయి అకాడమీకి సెలెక్ట్ అయింది. ఖోఖో బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి సాధించారు. కబడ్డీ మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి, క్రికెట్ మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి జిల్లా క్రీడాకారులు సాధించడం హర్షణీయమన్నారు. దీనిలో జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి రాజశ్వేరి, డీపీఓ నారాయణ రెడ్డి, డీఎల్‌డీఓ ఉషారాణి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ట్రైనర్‌లు పాణ్యం వేణు, శ్రీనివాసులు, సీనయ్య, శివశంకర్, ఎం మోహన్, కాశీవిశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సురేష్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు మెడల్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను సహేతుకంగా సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులకు వివరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, లోకేశ్వరరావు, వరకుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

– గిద్దలూరుకు చెందిన కె కోటేశ్వరరావు డయల్ యువర్ కలెక్టర్ కు ఫోన్ చేసి తనకు రావాల్సిన కోర్టు అమౌంట్ రీఫండ్ పెండింగ్‌లో ఉందని త్వరగా ఇప్పించాలని కోరాడు. గిద్దలూరు తహశీల్దారును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

– మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన వీరారెడ్డి తనకు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రావాల్సిన నష్ట పరిహారాన్ని త్వరితగతిన అందజేయాలని కోరాడు. స్పందించిన కలెక్టర్ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను పరిష్కరించాలని ఆదేశించారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు

ఒంగోలు: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మానసికంగా అందుకు సిద్ధం కావాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు(డీసీఈబీ) కార్యదర్శి వై.వెంకట్రావు సూచించారు. స్థానిక రాంనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యవస్థాపక ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. సరైన నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి కల్పించే స్థాయికి చేరవచ్చన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఉద్యం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. జిల్లా వ్యాప్తంగా 75 మంది విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించగా రెండింటిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ మస్కిటో కిల్లర్ మిషన్ ప్రథమ స్థానం, గురవాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ రీఫారెస్టబుల్ పెన్స్ అండ్ బ్యాగ్స్ అనే ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ నెల 6న విజయవాడలో రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఈ రెండు ప్రాజెక్టుల విద్యార్థులు హాజరవుతారు. విజేతలకు డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, ఈఎండీపీ జిల్లా మేనేజర్ బ్రహ్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు, జిల్లా జ్యూరీ మెంబర్స్ బి.తిరుపతయ్య, కె.రాము, పీవీ రమణయ్య, ఎస్.నాగేశ్వరరావు మెమెంటోలు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు.



విజేతలకు ప్రశంస పత్రాలు అందిస్తున్న డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు

ప్రజల చెంతకు ఈవీఎంలు

- ప్రజలకు అవగాహన కల్పించేందుకే..
- కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి
- ఒంగోలులో ఈవీఎంల గోడౌన్ పరిశీలన

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలకు ఈవీఎంలను వినియోగించే పద్ధతిపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని, ఆ మేరకు మండల తహసీల్దార్లకు ఈవీఎంలను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భద్రతా చర్యలు తీసుకుని ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు బీయూ, సీయూ, వీవీ ప్యాట్‌ను పంపుతున్నామన్నారు. అందుకోసం ప్రత్యేక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. పంపుతున్న పరికరాలను ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టంలో నమోదు చేస్తున్నామని, ఈవీఎం వివరాలతోపాటు సీరియల్ నంబర్లను కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమం పూర్తి కాగానే ఈవీఎంలను గోడౌన్‌కు చేరేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కలెక్టర్‌తోపాటు జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, సత్యం, స్వరూప్, కాలేషాబేగ్, రఘురాం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

- ఏఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు
- పోలీస్ స్పందనకు 71 ఫిర్యాదులు

ఒంగోలు సబర్బన్: స్పందన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి సత్వరమే న్యాయం అందేలా చూడాలని జిల్లాలోని పోలీస్ అధికారులకు ఏఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు సూచించారు. సోమవారం గెలాక్సీ భవన్‌లో నిర్వహించిన ఏఎస్పీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించగా 71 ఫిర్యాదులు అందాయి. అర్జీదారులతో ఏఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్య పూర్వాపరాలు సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. చట్ట పరిధిలో పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. స్పందనలో అత్యధికంగా కుటుంబ కలహాలు, భర్త, అత్తింటివారి వేధింపులు, భూ వివాదాలు, ఉద్యోగ మోసాలపై ఫిర్యాదులు అందినట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు

టెట్ పరీక్షకు 101 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు(టెట్) ఆదివారం రెండు విడతలుగా 3 సెంటర్లలో జరిగింది. పరీక్షకు 101 మంది గైర్హాజరైనట్లు డీఈవో డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3 సెంటర్లలో 829 మంది హాజరుకావాల్సి ఉండగా 728 మంది మాత్రమే హాజరయ్యారు.

సెంటర్ వారీగా హాజరైన వారి వివరాలు

పరీక్ష కేంద్రం	ఉదయం			సాయంత్రం		
	మొత్తం అభ్యర్థులు	హాజరైన వారు	గైర్హాజరైన వారు	మొత్తం అభ్యర్థులు	హాజరైన వారు	గైర్హాజరైన వారు
నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చెస్ యాక్షన్ ఇండియా	240	209	31	0	0	0
క్విస్ కాలేజీ	150	134	16	156	144	12
డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కాలేజీ	140	126	14	143	115	28
మొత్తం	530	469	61	299	259	40